


## సంగారెడ్డి ఫసల్ వాది విద్యా పీఠానికి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తా..

**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి మండలం ఫసల్ వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రథసప్తమిని పురస్కరించుకొని 1,671 మంది మహిళలతో భారీస్థాయిలో పాపనాశ వ్రతాన్ని నిర్వహించారు. మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపిసిసి జనరల్ సెక్రటరీ తోపాజి అనంత కిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పాపాలను హరింపజేసే ఈ వ్రతం లోక కళ్యాణార్థం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ఫసల్ వాది విద్యా పీఠానికి సీఎం రేవంత్ రెడ్డి ని తీసుకువస్తానని చెప్పారు. అలాగే రఘురామ కృష్ణంరాజు ఏపీ సీఎం చంద్రబాబు ను తీసుకురావాలని కోరుతున్నానని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజం

### - జిల్లా అధ్యక్షుడు టీ తిరుపతి రెడ్డి




**విశ్వంభర, మలక్ పేట్ :** ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజం అని పి ఆర్ టి యు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి తిరుపతి రెడ్డి అన్నారు. అఫ్జల్ గంజ్ లో జి హెచ్ ఎస్ , జిహెచ్ఎం పద్మజ ఉద్యోగ విరమణ అభినందన సభలో తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు మందడి వెంకట్ రెడ్డి , ప్రద్యుమ్నారెడ్డి బలవంత రెడ్డి , వెంకటేష్, అశోక్ , సురేష్ కుమార్ పాల్గొని పద్మజ ని ఘనంగా సన్మానించారు.


## సమాచార హక్కు చట్టంపై ప్రజలందరికీ అవగాహన అవసరం

- తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు వర్రె వెంకటేశ్వర్లు
- సమాచార హక్కు వికాస సమితిని గ్రామస్థాయి వరకు విస్తరించేలా కృషి చేయాలి
- వైశ్య వికాస వేదిక చైర్మన్ డా.కాచం సత్యనారాయణ



**విశ్వంభర, సరూర్ నగర్ :** సమాచార హక్కు చట్టంపై ప్రజలందరికీ అవగాహన అవసరం అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ ,వికాస సమితి ముఖ్య సలహాదారులు వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తపేట వాసవి కాలనీలో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో వర్రె వెంకటేశ్వర్లు, కాచం సత్యనారాయణ లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంమని, సమాచార హక్కు వికాస సమితిని గ్రామస్థాయి వరకు విస్తరించేలా కృషి చెయ్యాలని, ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన పొందాలని, అవినీతి, అక్రమాలను ప్రశ్నించాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. వికాస సమితిని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నియోజక వర్గాలలో, మండలాలలో సభ్యులను చేర్పించి, కమిటీలను వేయడంతో పాటు వారికి చట్టాల పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు త్వరలో ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆసక్తి గల ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామని, శిక్షణ పొందిన వారు ప్రజా సమస్యలు పరిష్కారానికి సలహాలు, సహాయం చేయు స్థాయికి వచ్చేలా ప్రముఖులతో శిక్షణ ఇప్పించనున్నామని వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొదుమూరి దయాకర్ రావు తెలిపారు.

వికాస సమితి కి పూర్తి స్థాయిలో న్యాయ సహాయం చెయ్యడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉచితంగా న్యాయ సలహాలు ఇస్తున్నామని వికాస సమితి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు,ప్రముఖ న్యాయవాది టి.కరుణాకర్ రెడ్డి తెలిపినారు. ఈ పూజ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వై. హేమలత, రాష్ట్ర కార్యదర్శి ప్రియా రెడ్డి, ప్రభావతి, వైశ్య వికాస వేదిక సలహాదారులు నంగునూరు రమేష్ , ప్రముఖ వ్యాపారి బుర్రి వేణు యాదవ్ , చందు, కాసం శ్రీనివాస్, పురెందర్, ఇరుగు శ్రీధర్, ఉప్పల శ్రీధర్, తేలుకుంట్ల రాంబాబు, వీ3 సీనియర్ జర్నలిస్ట్ దుమ్మ నవీన్, మార్కెటింగ్ మేనేజర్ రాజు గుప్త, వేముల మురళి, సాయి భార్గవ్, రాకేష్, కూర రమేష్, బి.రాములు, శ్రీకాంత్, కృష్ణ మనోహర్, ఫుడ్ కోర్ట్ శ్రీనివాస్, వంగవీటి శ్రీనివాస్, ఉదయ్ సింహారెడ్డి, తుంగతుర్తి రామకృష్ణ, , కాకర్ల సుధాకర్, పరమేశ్, సంతోష్ ,జూలూరి శ్రీరాములు, చిత్రం సైదులు పాల్గొన్నారు.









## రైతు చెంతకే 'భూధార్'

- భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేస్తున్నాం
- శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలుకుతున్నాం
- సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నాం
- లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేసిన పొంగులేటి




**విశ్వంభర, ఖమ్మం :** భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చిందని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఐడీఓసీ శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. "గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా



'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నాం. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాలవారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించాం" అని వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని, ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు.

## తెలంగాణ ఉద్యమ తొలి నవల "విప్లవయోధులు" : ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** రవీంద్రభారతి, సమావేశ మందిరంలో *1953లో ఎమ్.ఆర్.నాగం అనే రచయిత రచించిన 'తెలంగాణ విప్లవ యోధులు' అనే నవలను తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఆవిష్కర్త మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య చరిత్రను పునస్సమీక్ష చేయించాల్సిన అవసరాన్ని "విప్లవ యోధులు " అనే ఈ నవల ముందుకు తెచ్చిందన్నారు.ఈ సభకు తెలంగాణ ప్రముఖ రచయిత, తెలంగాణ తొలి బీసి కమీషన్ చైర్మన్ బిఎస్ రాములు గారు అధ్యక్షత వహించి అధ్యక్ష తొలి పలుకులలో ఇది విద్యార్థులకు పాఠ్య పుస్తకంగా చేరవలసినది కనుక ఉపవాచకంగా పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి గారు తొలికాపీని రచయిత సతీమణి శ్రీమతి నాగం సుశీలమ్మ (90) కి అందించి వారి ప్రసంగంలో ఈ నవల పై పరిశోధనలు జరగాలన్నారు. ఈ నవలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించిన చరిత్ర పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఈ నవల పై ఒక సెమినార్ నిర్వహించాలన్నారు, నల్గొండ కవి సీనియర్ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి వతమ ఉపన్యాసంలో ఈ నవలలో చారిత్రక అంశాలెన్నో చర్చించాల్సి వున్నదన్నారు. నవల కాపీని భద్రపరిచి కుటుంబ సభ్యులకు




అందించిన హెచ్ రమేష్ బాబు గారు ఈ అవకాశం దొరకడం తమకు దక్కిన గౌరవం అన్నారు. విజయ కుమార్. జి, తెలంగాణ అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి గారు తర్వాత ముద్రణ బాధ్యత తెలంగాణ అకాడమీ తీసుకుంటుదన్నారు. బహుళ పత్రిక సంపాదకులు జ్వలిత సాహితీ కొరులు తమ కుటుంబంలో సాహితీ వారసులను ఏర్పరుచుకోవలని, లేనట్లయితే తమ రచనలను భద్రత పరిచే వారుండరని, నవలా రచయిత తనయ ఈ నవలను పునర్ముద్రించి ఆవిష్కరణ సభ నిర్వహించడం ఒక చారిత్రక సంఘటన అన్నారు. ఈ సభలో రచయిత్రులు సుజాత శేఖర్, బండారు విజయ, పైడిమర్రి గిరిజ, నాగం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. 'తెలంగాణ విప్లవ యోధులు' అనే విశేషమైన నవలను పునర్ముద్రణకు పూనుకున్న నవలా రచయిత కుమార్తె సుమతి చురుకంటిని అందరూ ప్రశంసించారు. ఇది తొలి తెలంగాణ నవల. తెలంగాణ చరిత్రకు సంబంధించి, తెలంగాణ సాయుధ పోరాటం గురించిన అనేక వెలుగు చూడని అంశాలు ఈ నవలలో ఉన్నాయని.ఇప్పటి వరకు 1955లో వట్టికోట ఆళ్వార్ స్వామి రాసిన నవల 'ప్రజల మనిషి' నవలను తెలంగాణ మొదటి నవలగా ప్రచారం లో వున్నది. కానీ 1953 లో ముద్రితమైన ఎమ్. ఆర్. నాగం రాసిన 'తెలంగాణ విప్లవ యోధులు' నవల తెలంగాణ సాహిత్య చరిత్రలో రికార్డు అవుతుందని సంగిశెట్టి శ్రీనివాస్ ముందుమాటలో రాశారు.ఈ నవలను వారి కుటుంబసభ్యులు పునర్ముద్రించారు. రజాకార్ల దురాగతాలు, సామాజిక పరిస్థితులు, సామాన్య జనం ఎదుర్కొన్న కష్టాలు వేదనలు, పార్టీల వైఖరులు, స్పష్టంగా ఈ కథలో ప్రతిఫలిస్తాయి. ఏడు దశాబ్దాలకు పైగా ఎక్కడా లభించని విలువైన రచనను నేటి తరానికి అందించడం, చరిత్రలో కలిసిపోతున్న ఒక చారిత్రక సాక్ష్యాన్ని తిరిగి వెలుగులోకి తేవడం, 90 ఏళ్ళ పైబడి వున్న రచయిత భార్య కి తొలికాపీ అందించాలన్న కోరికతో ఈ పునర్ముద్రణ చేపట్టడం విశేషం. ఈ సభలో రచయిత కుటుంబ సభ్యులందరు, రచయిత సహ ఉద్యోగులు, శిష్యులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ సభా కార్యక్రమం ఒక పండుగలాగా జరిగింది . ఇదొక చారిత్రక ఉత్సవం.

## చంపాపేట కార్పొరేటర్ వంగా మధు సూదన్ రెడ్డికి ఘన నివాళులు





**విశ్వంభర, హైదరాబాద్ :** చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అకాల మరణం చెందగా.. ఇవాళ ఉదయం కర్మాన్ ఘాట్ లోని వారి నివాసం వద్ద మధు సూధన్ రెడ్డి భౌతిక కాయానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. చిన్న వయసులోనే మధు సూధన్ రెడ్డి మన మధ్య నుండి దూరమవ్వడం తనను వ్యక్తిగతంగా కలిచివేస్తుందని,ఆయనతో అనుబంధం 30ఏళ్ల నాటిదని,తనకు సోదరుడులాంటివాడని ఆయనతో ఉన్న జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. గొప్ప ప్రజానాయకుణ్ణి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,మనోధైర్యం చెప్పారు. భగవంతుడు మధు సూధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూర్చాలని మంత్రి ప్రార్థించారు. అదేవిధంగా చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అకాల మరణం పట్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం కర్మన్ ఘాట్ లోని మధుసూదన్ రెడ్డి నివాసానికి వెళ్లి, ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వంగా మధుసూదన్ రెడ్డి ప్రజాసేవకు అంకితమై నిరంతరం పనిచేశారని, ఆయన అందించిన సేవలు ప్రశంసనీయం అన్నారు. ఆయన అకాల మరణం ప్రజలకు, పార్టీకి తీరని లోటు అని ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు, శ్రేయోభిలాషులకు తన ప్రగాఢ సానుభూతి మరియు సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని ఆమె అన్నారు. మధుసూదన్ రెడ్డి భౌతిక కాయానికి ఎంపీ ఈటెల రాజేందర్, వీ3 న్యూస్ చానల్, విశ్వంభర దిన పత్రికల ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ నివాళులర్పించారు.



